# నిరావాన

రచన :
శ్రీ అడపా చిదానందశ్రీ.

ఆరోజు జీవితానికి ఉషోదయ మౌతుందనే చెప్పాలి.

కలల దివ్వెలు వెలుగు వెన్నెల్ని చిలికాయనే చెప్పాలి. హృదయంలో చిన్న తుంపరగా అమృతం కురిసిందనే చెప్పాలి. వెండి వెన్నెల - దీవిలో... ఆమని పాడిందని కూడా చెప్పాలి.

మాధవితో హృదయ పూర్వకంగా గడిపిన ఆరోజు...మరపురానిదే అవుతుంది. మధుర స్మృతుల బంగారు పుటలలో... మనోహర దృశ్యాలను...చిత్రించిన రోజే అవుతుంది.

స్లిమత్ కారు...నల్లగా మెరుస్తున్న తారు రోడ్డుమీద... మెత్తగా జారిపోతోంది. జల్లు జల్లుగా వెన్నెల జడివాన. మత్తుగాలిపై నీహారిక పరవశింపు.

మాధవి మృదువైన లలాటం. ముచ్చటగా మధుర లాస్యం చేసే ముంగురుల చిలిపిదనం మంచి నీటికొలనులో యెగిరెగిరి పడే మీనాల నయనాలు.

'మధూ......ఒక్క పాట పాడవూ...?'

'ఇప్పుడు పాటిలేమిటి చెప్పండి...!'

'మరెప్పుడు పాడుకుంటా రేమిటి ..?'

'బావుంది ఇప్పుడు పాడితే సినిమా శృంగారంలా వుంటుంది.'

'లోకమంతా చూస్తుంది కాబట్టి అది చవకబారు శృంగారం—అనిపించింది నీకు. మరి ఈ ప్రశాంత ప్రకృతికన్నె పరవసింపులో...యదనిండిన మధుర ప్రేమ పలకరింపులో......'

'చాలు చాలు...ఆపండి మీ భావ కవిత్వం.

'అయితే మరి పాడుదూ...కారు మెల్లగా పోనిస్తాను...'

ఊహూ...మీరొకంతట వదులుతారూ...సరే ఏపాట చెప్పండి.'

'గుడ్! ఆలా అడుగు సినీపాట కప్ప మరేదయినా .....'

'ఆ మరేదేదో... చెప్పుదురూ...'

అరిసిపాలెం ? నా గేయానికి ట్యూను కట్టావుగా...అది

'ఊఁ...అలాగా...అబ్బాయిగారి పాట అబ్బాయిగారే వింటారా?..'

'మరి...అమ్మాయిగారికూడా సమాన హక్కు యిచ్చానుగా...'

'అదేమిటో......?'

'నువ్వు కట్టిన ట్యూన్ నువ్వే వినడం...!'

'ఎంతైనా... భావకవిలు...'

'అదిగో ..అప్పుడే అరమైలు దూరం పరిగెత్తింది కాలం!'

'వీణియ మదిరమూ...కురిసేనూ...
మధుర ప్రేమనే...చిలికేను.
హృదయము నిండా...మల్లెలవా...సన,
మధుర స్మృతులనే,...రేపేను,...
భావమునీ...వై....రాగము నేనై....

ఆమె గీతానికి నా హృదయంలో మల్లెపూలు పూశాయి. మధుర భావాలు రేపాయి, మమత గోదావరి గలగలా పారింది. తెలి వెన్నెల తేల్లబోయి చూసింది. రోడ్డు ప్రక్క చెట్లు ఈర్ష్యగా నల్లని నీడల్ని పరిచాయి. ఆ వెలుగు నీడల్ని త్రోసుకుంటూ మా కారు ధైర్యంగా ముందుకు పోతోంది.

మాధవి...పాట ఆపి నావైపు వింతగా చూస్తోంది.

'జీవితం కూడా ఓ కారు ప్రయాణంలాంటిదే కదూ ...మాధవీ... వెలుగు - నీడల్ని దాటుతూ ముందుకు సాగిపోయి నప్పుడే అది జీవితం అనిపించుకుంచుకుంటుంది...'

'సరి...సరీ...పాట మర్చిపోయి...యిందులోకి దిగారు'.

'ఊహు...అదికాదు. నీ పాట విన్నప్పుడు...అలలు అలలుగా ఆనందం తరలి వచ్చింది. హృదయం మధురాను భూతితో నిండినప్పుడే...జీవిత సత్యాలు తాన్నెన్నో ప్రకృతిలో కనిపిస్తాయి...ఔనంటావా?'

ఎలా కాదనగలను చెప్పండి...పాటలో... భావాన్ని విడిచి రాగం యెలా వుండలేదో...అలాగే జీవితంలో సుఖాల్ని విడిచి...కష్టాలుకూడా వుండలేవు.

అవి రెండూ,..యిందాక మీరు చెప్పినట్లు... వెలుగు నీడల్లా వెన్నంటే వుంటాయి.'

'అబ్బ! ఎంత దివ్యంగా చెప్పావు మాధవీ. నేను జీవితంలో ఎప్పుడూ కోరుకునే మాధవ్వి నువ్వే... నేను నిజంగా యెంత అదృష్టవంతుడ్ని!'

'అరరే...అదేవిటండీ...స్టీరింగు వదిలేశారు.....!'

'ఓ...! పరవాలేదు...'

మాధవి కోరుకున్న భార్య కలలుకన్న మమతమాల ఆమె నాపాట. నా గేయం నా భావం నా జీవితం!

× × × +

ఒకప్పుడు మాధవి నాన్నకు నేనంటే యెందుకు యిష్టంలేదో నాకు తెలుసు. డిగ్రీలైనా వుండాలి. పుష్కలంగా డబ్బు అయినా వుండాలి. ఇవేకదూ నేటి కాలమానం? హృదయం ఎవరిక్కావాలి? హుందా లేకపోయినా హోదా కావాలి. డబ్బుతో కొనుక్కునే సుఖాలే కావాలి.

సరే...మాధవి కోసరం యేమైనా చెయ్యాలనిపించింది. విశేషమైన పరిశ్రమతో... రెండు డిగ్రీలు కొనుకొన్నాను. ఐ. ఏ. యస్., వరించింది. అప్పుడు మాధవి నాన్నకు... చెప్పలేనంత ప్రేమ, వాళ్ళింటికి ఆహ్వానాలు తేనెలొలుకు మాటలు. రాజీలు ముహూర్తాలు, పెళ్ళిబజంత్రీలు. నాకు కావలసిన మాధవి హృదయం లభించింది. నాకిష్టలేని అతని సంగతి నాకెందుకు......

'ఏమిటండీ...మరీ అన్ని ఆలోచనలూ...మన యిల్లు దగ్గిర పడింది...'

'ఆ...ఏమిటీ...ఆఁ...ఆ....!'

× × × ×

సంధ్య చీకటులు విడిపోయాయి. వెలుగు తెల్లచీర కట్టుకుంది. లేస్తూనే మాధవి...అరచేతిని ముద్దుపెట్టుకుంది. నా మొద్దు నిద్రను చూసి, ఆ చప్పుడు, నవ్వినట్లే భ్రమించి కళ్ళు విప్పాను. 'మరి .. నాకో...?' అన్నాను.

'ఊఁ... తెల్లవారింది...!' అంటూ వెళ్ళిపోయింది. తిరిగివస్తూ...టూత్ బ్రష్ చేతికిచ్చింది. తొందరగా బాత్ రూమ్ వైపే నా అడుగులు పడ్డాయి.

తిరిగి వచ్చేసరికి పొగలు క్రక్కే కాఫీతో నవ్వుతూ ఎదురొచ్చింది మాధవి. చుట్టూచూసి, ఆ పైటచెఱగుతోనే ముఖం తుడుచుకొని, కాఫీ అందుకున్నాను.

'మరి...నీకో...?'

'వుంది లెండి...!'

'ఏదీ...యెక్కడా?.,,'

'అబ్బబ్బ! నేనేమీ త్యాగమూర్తినికాదు లెండి... నాకు లేకుండా యిచ్చేయడానికి...' చిలుకకోపం నటిస్తూనే నవ్వింది. దంతసరళి కూడా గమ్మత్తుగా నవ్వింది.

'సరేలే! ఆదేదో యిక్కడికే తీసుకు రారాదూ? యిద్దరం కలిసి...కబుర్లు చెప్పుకుంటూ త్రాగుదాం..'

'సరే లెండి...' ఆమె ముఖంలో వెలుగు, కళ్ళల్లో


చర్మ వ్యాధులచే బాధపడువారికి ముఖ్య విషయం !!



మా ప్రధాన వైద్యులు ఆర్. శంకరనారాయణన్ B. A, B. L.

ప్రసిద్ధ సిద్ధవైద్యులు, చర్మ వ్యాధుల నిపుణులు మీ వూరు త్వరలో వస్తున్నారు.

తామర, తెల్లమచ్చలు, చిడుము, నవాయి వగైరా వ్యాధులు గలవారు వీరిని సంప్రతించి ఔషధములు పుచ్చుకోండి.

ఆనంద వైద్యశాల
పలని. (S. I)

ANANDA VAIDYASALAI
PALANI (S. I.)

వెలుగు కిటికీ గుండా రవి వెలుగు. నా హృదయం నిండా కూడా తృప్తివెలుగు!

కాఫీ అయ్యాక...సిగరెట్ తీశాను. ఆమె లైటర్ తీసి వెలిగించింది. తృప్తిగా పొగ పీల్చి వదిలాను.

'మీరు...సిగరేట్ మానేయాలి.'

'ఓ...యస్...!'

'ఎప్పుడు?'

'అదే నాకు తెలియడంలేదు...!'

'పెంకితనం మానండి. తప్పకుండా మానేయాలి,'

'ఏది...? పెంకె తనమా...సిగరెట్టా?.,.' పాపం సీరియస్‌నెస్ అంతాపోయి...నవ్వేసింది.

'రెండూను...' ముఖ్యంగా ఆ రెండవ శత్రువును.

'ఓయస్...చూద్దాం!'

'ఏమిటి చూస్తారు? సిగరెట్ మానేసేదాకా... నేను...మీతో మాట్లాడేదికాదు...'

అక్కడనుండి ఆమె వెళ్ళి పోతూవుంటే,,.ఇదేమిటిరా చిలికి చిలికి గాలివాన తయారయి పోయింది...అని నాపోయెను.

ఆమె వంటగదికి వెళ్ళింది, పొయ్యిదగ్గర నిల్చుంది. దగ్గరగా వెళ్ళాను. ఆమె...జడ చివరి భాగాన్ని విప్పుతూ...మళ్ళీ వేస్తూ...నిప్పుల్లోకి చూస్తూవుంది. నీలాల్లా మెరుస్తున్నాయి నయనాలు.

'చూడు మాధవీ ... ఈరోజునుండి మరి నేను సిగరెట్టు ముట్టుకుంటే ఒట్టు.' అంటూనే...ఖరీదయిన 'కాప్స్టెన్ పాకెట్'ను పొయ్యిలో పడేశాను. చక్రాల్లాంటి కళ్ళ చుట్టూ కనుబొమలు కాపురం పెట్టాయి. 'నిజంగానే...' అంది.

'నిజం నీ కోసరం యేమైనా చేస్తాను.' రాగరంజితమైన చక్కిలి ఆమెది. ప్రభందకన్య ప్రసాదించిన మధురమైన ముద్దు...యించుక ముచ్చటగొలిపింది. హృదయం నిండా వెన్నెలకురిసింవి.

× × × ×

టేబుల్ లైటు వెలుగుతోంది, ఆమె రాసుకుంటోంది. చేతిగాజులు చిత్రంగా మెరుస్తున్నాయి. ఆమె రాసేది యేమిటో నాకు తెలుసు.

'ఎందుకు మాధవీ నీ కంత శ్రమ. రేపు మిగతాది చూసుకోవచ్చును పద.' అంటూ లేపబోయాను.

'ఇదే మంత శ్రమ కాదు లెద్దురూ...మీరు రాసిన కథల్నె సాపు వ్రాస్తున్నాను..,అంతేగా!' అంది.

'సరిసరి.. అదే రేపు చూసుకోవచ్చునంటున్నాను...లే...మరి.,.!'

'అయిపోవచ్చింది వుండురూ కాసేపూ...'





• శ్రేష్టమైన రకం
• తక్కువ ధర
• చిరకాల మన్నిక
• చక్కని అల్లిక
ఇవే



'పొన్‌మని' బనియన్ల ప్రత్యేకత

(ఏజెంట్లు లేని ఊళ్లో ఏజెంట్లు కావలెను)

: వివరములకు :

పొన్‌మని నిట్టింగ్ కంపెని
పాలెత్. ఎన్. రోడ్డు : : తిరుపూరు

PONMANI KNITTING CO.,
P. N. ROAD :: TIRUPUR (SI)

**SRV FABRICS**

"Buy handloom fabrics, for when you buy, you fulfil your requirements, and serve a noble cause too. viz help the poor weaver to earn his bread"

SRI RAMA VILAS WEAVING FACTORY,
P. B. No. 4
KARUR.

Phone : 40. Tel : BELIEF.

'ఎక్కడయిపోవచ్చింది...యింకా ఆరు పేజీలు వుంది తెలుసా?...లే,,.లే...!' తొందర పెట్టాను.

'అయినా మీ పిచ్చికానీ..,మీరు వ్రాసిన కథలకు... నేనీమాత్రమైనా సేవ చెయ్యలేక పోతే...సంతృప్తి ఏమిటి వుంటుంది చెప్పండి?'

'పిచ్చి మాధవీ...నువ్వు రచయిత పెళ్ళానివి. నువ్వు ఆ సేవ చేసినా...చెయ్యకపోయినా ఆ ఘనక నీకు యెప్పుడూ వుంటుంది. నాకథలకు నువ్వు శిల్పానివి నారసమయ శిల్పానికి జగత్తులో నువ్వు నా సౌందర్య రాశివి. లోకంలోని మధురమైన వస్తువులన్నింటికి నువ్వొక ఇన్స్పిరేషన్!'

పెరటి తోటలోని మల్లెలు గాలితో కబురంపాయి మనసు మమత సౌధంవైపు కదిలిపోయింది. నీలం రంగు బెడ్‌రూమ్ లైటు వెలిగింది.

కిటికీలోనుండి నీరెండ!అవతలి నుండి విసుగ్గా యెవరిదో గొంతు.

చ...ఛ...సా మాధవి యింత విసుగ్గా యెప్పుడూ పిలవలేదు. 'స్సార్...లెజర్స్...!!'

ఛి...ఫూల్...స్కౌండ్రల్...నా వూహా లోకాన్ని డిస్టర్బ్ చేశాడు. మళ్ళీ ఆ మూడ్...చస్తేరాదు. అనుకుంటూనే, ఉత్తరాలు రెండూ అందుకున్నాను.

మధురాతి మధురమైన స్వప్నజగత్తు నుండి...ఈ క్రుళ్ళు ప్రపంచంలోనికి మళ్ళీ పడి పోయాను. రోజూ బుక్ పోస్టుతో వచ్చే దినపత్రికే ఆవేళా వచ్చింది.

దినపత్రిక విప్పాను మూడవ పేజీలో నిండా బియ్యే., మొదటి సంవత్సరం పరీక్షాఫలితాలు కనిపించాయి. కళ్ళు మెరిశాయి. నా నెంబరు వెతికాను మళ్ళీ వెతికాను మళ్ళీ మళ్ళీ వెతికాను. చాలాసార్లు వెతికాను. ఎక్కడా కనిపించలేదు. గుండె వేగంగా కొట్టుకుంటోంది.

ఏమయి పోయాను? నేనేమైపోయాను?

'ఎందుకిలా అయిపోయావు?' హృదయంలో 'నేను' ప్రశ్న!!

విషాదం కషాయం దుఃఖం వైరాగ్యం ఇక లేనిదేమిటి? మిగిలిందేమిటి?

అన్యమనస్కంగా రెండవ కవరు విప్పాను. చదివాను. 'చి॥ సౌ॥ మాధవిని...డా॥ మనోహర్‌కి యిచ్చి...' మరి చదవలేక పోయాను.

ఆశాసౌధం కుప్పగా కూలిపోయింది. గాలిమేడలు గాలిలోనే తేలిపోయి...సముద్రంలో కూలిపోయాయి. పిడకల మేడలు...విధి కురిపించిన వేడి వర్షంతో తడిసి ముద్దయ్యాయి.

మధుర స్వప్నంలోని సౌఖ్యం యిది!

వాస్తవిక ప్రపంచంలోని విషాదం యిది!

సౌఖ్యం, విషాదం కలసిన జీవితంలోని పాఠం— యిది!

జీవితంలో కలలు వున్నాయి.

కలల్లో జీవితం లేదు!

ఆశలో జీవితం వుంది.

అత్యాశలో మంచికాదు!

భగవాన్! నాకల చెరిగిపోయింది. దుర్భరమైన ఈ వాస్తవికతను యెలా భరించేది?......అతని చెయ్యి తగిలి...మూత లేని రెడ్ యింక్ బాటిల్...విరగబడింది. కాగితాల నిండా ఎఱ్ఱసిరా ఒలికింది...అతను ...పిచ్చిగా ..అరచేతులు అందులోముంచి...ఏమిటో చూసుకున్నాడు...వెర్రిగా!!

'ఇంకొక ప్రమాదం జరగకుండా...సూచన యిచ్చేందుకే బహుశః...ఆ ఎఱ్ఱసిరా...ఒలికి వుంటుంది.' అని అతను అనుకుని వుండ—వచ్చును కదూ...?